క్లుప్తంగా

సంగారెడ్డి కాల్వ మార్చాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

నర్సాపూర్: కొండ పోచమ్మ – సంగారెడ్డి కాల్వను ఇతర గ్రామాల మీదుగా మార్చాలని పలు గ్రామాల రైతులు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండ పోచమ్మ సంగారెడ్డి కాల్వ నిర్మించ తలపెట్టిన గ్రామాలన్ని హెచ్‌ఎండీఏ పరిధిలోని రీజినల్ రింగ్ రోడ్డు మధ్య వస్తున్నాయని, ఆయా గ్రామాలు మున్ముందు అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని వారు చెప్పారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కాల్వను ప్రస్తుతం ఎంపిక చేసిన గ్రామాలు కాకుండా ఇతర గ్రామాల మీదుగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు నర్సింహారెడ్డి, మహేశ్‌గౌడ్, పెంటయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

దుంపలకుంటలో పోలీస్ కవాతు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని దుంపలకుంట చౌరస్తా రంగంపేట గ్రామాల్లో మంగళవారం పారా మిలటరీ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల దష్ట్యా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పారామెలటరీ బలగాలతో కవాతు నిర్వహించినట్లు ఎస్‌ఐ గౌస్ తెలిపారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు, బెదిరింపులకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ కవాతులో ఏఎస్‌ఐ తారా సింగ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత

హవేళిఘణాపూర్(మెదక్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్‌ను పట్టుకొని ఇద్దరి డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు మెదక్‌రూరల్ ఎస్‌ఐ అమర్ మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని మల్కాపూర్ తండాకు చెందిన టిప్పర్ డ్రైవర్ మెగావత్ రాజు, ట్రాక్టర్ డ్రైవర్ మాన్‌సింగ్‌లు మంగళవారం తెల్లవారుజామున మల్కాపూర్ నుంచి కోంటూర్ వైపు అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎవరికైనా ఇసుక అవసరం ఉంటే అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

అదృశ్యం



సీతాల ఈరమ్మ

మనోహరాబాద్(తూప్రాన్): మండల పరిధిలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన వృద్ధురాలు కనిపించట్లేదని ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం కాళ్లకల్ గ్రామానికి చెందిన సీతాల ఈరమ్మ(50) కొంత కాలంగా నోటి మాట రావడంలేదని తెలిపారు. ఆమె మానసిక పరిస్థితి బాలేకపోవడంతో తన కూతురు బ్యాగరి రేణుక తన గ్రామమైన నర్సాపూర్ తీసుకెళ్లి ఆదివారం సాయంత్రం కాళ్లకల్ తీసుకొచ్చిన తర్వాత రాత్రి సమయంలో ఇంట్లో కనబడకుండా పోయింది. దీంతో చుట్టూ పక్కల, బంధువుల ఇంటిలో వెతికినా.. ఆచూకీ దొరకలేదు. దీంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్‌కే సాధ్యం

జగదేవ్‌పూర్(గజ్వేల్): సంక్షేమ పథకాల అమలు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని కొండపోచమ్మ ఆలయ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతరెడ్డి అన్నారు. ఆరు గ్యారంటీల అమలులో భాగంగా సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టడంతో మంగళవారం మండలంలోని మునిగడప గ్రామంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మచ్చేందర్‌రెడ్డి, ప్రసాద్, వెంకటస్వామి, కిషన్, భాను, అశోక్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా మన్నె శ్రీనివాస్

ములుగు(గజ్వేల్): బీజేపీ ములుగు మండల నూతన అధ్యక్షుడిగా బస్వాపూర్ గ్రామానికి చెందిన మన్నె శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మన్నె శ్రీనివాస్ మంగళవారం వంటిమామిడిలో మాట్లాడుతూ.. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



దానంపల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేట మండలంలోని ఆరేపల్లి, చీలపల్లి, శివాయిపల్లి, ఉత్తులూరు, దానంపల్లి, మూసాపేట్, బూరుగుపల్లి తదితర గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బూరుగుపల్లి ఆలయంలో కోటమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామని, పెద్ద శంకరంపేట మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధు, సీనియర్ నాయకులు నారాగౌడ్, రాజేందర్ గౌడ్, జనార్దన్, ఆర్యన్, సంతోష్, సత్యనారాయణ, పెరుమాళ్ల గౌడ్, సంగమేశ్వర్, మాజీ ఎంపీపీ రాజు, ఎంపీటీసీ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరుచేయడంపై నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఇన్‌చార్జి మంత్రి, సీఎం రేవంత్‌రెడ్డికి వెల్దుర్తి జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ఖుకునూర్, యశ్వంతరావ్‌పేట, ధర్మారం, దామరంచ, భస్వాపూర్, రామాయిపల్లి, శెట్టిపల్లి, బండపోసాన్‌పల్లి గ్రామాల్లో ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, మల్లేశం, విజయభాస్కర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తి(తూప్రాన్)సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ, నాయకులు



కొల్చారం(నర్సాపూర్): కోనాపూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మేఘమాల

ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ..

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కోనాపూర్, ఏటిగడ్డ మాందాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్డు పనులను మంగళవారం జెడ్పీటీసీ మేఘమాల, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్ ప్రారంభించారు. నిధుల మంజూరు కోసం కృషి చేసిన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శేఖర్, పార్టీ ప్రధాన కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, కోనాపూర్ పార్టీ అధ్యక్షుడు మల్లేశం, ఏటిగడ్డ మాందాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు అంజాగౌడ్, నాయకులు గొండ కృష్ణ, వెంకట్ గౌడ్, చందు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జొన్న పంట పరిశీలన



రేగోడ్(మెదక్):జొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ జావీద్

రేగోడ్(మెదక్): మండలంలోని జగిర్యాల గ్రామంలో మంగళవారం ఏఓ జావీద్ జొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జొన్న పంటలో మొవ్వ పురుగు నివారణకు క్లోరంత్రానిలిప్రోల్ మందును ఎకరాకు 80 ఎంఎల్/200 లీటర్స్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు(మొవ్వ పురుగు)ఈ దశలో ఎక్కువగా ఆశిస్తుందని, దీని నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4 జీ గుళికలు 8 కేజీ/ఎకరాకు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాం/లీటర్ నీటిలో 19:19:19 అనే రసాయన మందులను పిచికారీ చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుంటే రైతులు లాభాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ వినిత్‌కుమార్ పాల్గొన్నారు.

పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



చిన్నశంకరంపేట(మెదక్): సూరారం శివారులో పంట పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో పురుగుల మందు స్ప్రే చేయగా, పంట ఎండిపోయిన రైతు శ్రీశైలం వరి పంటను కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ సైంటిస్టులు మంగళవారం పరిశీలించారు. పురుగుల మందు వాడితే పండి ఎండిపోయిందని రైతు శ్రీశైలం పురుగు మందుల దుకాణం యజమానిపై వ్యవసాయ అధికారులకు ఫిర్యాదుచేయగా సైంటిస్టులు వచ్చి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నమూనాలను సేకరించారు. పురుగు మందుల దుకాణదారుడు విక్రయించిన మందుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఓ ప్రవీణ్ మాట్లాడుతూ.. వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించే నివేదిక ఆధారంగా పురుగుల మందులు విక్రయించిన దుకాణ యజమానిపై చర్యలు చేపట్టనున్నట్లు ఏఓ ప్రవీణ్ తెలిపారు.

వైభవంగా గురుపాదగుట్ట ఉత్సవాలు



గురుపాదగుట్టలో శివపార్వతుల కల్యాణోత్సవం

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రం శివారులోని గురుపాద గుట్ట శివాలయం ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం, ఎడ్లబండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, ఆలయ ధర్మకర్త బలరాం సంగమేశ్వర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

బండ్ల ఊరేగింపులో ఉద్రిక్తత




ఎడ్లబండ్ల ఊరేగింపులో భక్తులు

పెద్దశంకరంపేట శివారులోని గురు పాదగుట్ట ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల నుంచి ముస్తాబు చేసి ఎడ్లబండ్లను ప్రదక్షిణ నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో యువకులు నృత్యాలతో సాగుతున్న బండ్ల ఊరేగింపులో ఉద్రిక్తతకు దారి తీసింది. యువకుల మధ్య జరిగిన తోపులాట ఘర్షణకు దారి తీసింది. దీంతో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ శంకర్ ఆధ్వర్యంలో సిబ్బందితో లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం మళ్లీ బండ్లను యథావిధిగా ఊరేగించారు.

కొనసాగుతున్న మల్లన్న ఉత్సవాలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామంలో మల్లికార్జునస్వామి ఉత్సవాలు యాదవసంఘం ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం గ్రామానికి చెందిన నిర్మల, సురేశ్ ముదిరాజ్ దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామస్తులతో పాటు చుట్టూ పక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



సోమక్కపేటలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఘనంగా మూలమంత్ర విగ్రహ హోమం

హవేళిఘణాపూర్(మెదక్): మండలంలోని కూచన్‌పల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో శివ పంచాయతన నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం శివ పంచాయతన విగ్రహాలను కాశీ విశ్వేశ్వరుని సన్నిధానం నుంచి తీసుకొచ్చిన బృందం సభ్యులు, విగ్రహ దాతలు మూలమంత్ర విగ్రహ హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ నిర్వాహకులు తీర్థ ప్రసాద వితరణతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ యువకులు పెద్ద ఎత్తున పాల్గొని సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు శాస్త్రుల వేణుశర్మ, ఆలయ అర్చకులు కరణం మధుసూదన్, చీనూరి నారాయణరెడ్డి కొంపల్లి సుభాష్‌రెడ్డి, కరణం రామకృష్ణ, గడ్డమీద సుధాకర్‌గౌడ్, ఈర్ల లక్ష్మీనారాయణ, చీనూరి శ్రీనివాసరెడ్డి, ఈర్ల రమేశ్, మాజీ సర్పంచ్ దేవాగౌడ్, నామ అశోక్, నాయకవాడి భిక్షపతి, చినురి రామిరెడ్డి, ఆకుల యాదగిరి, బట్టు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

టేక్మాల్(మెదక్): విద్యార్థిని చితక బాధిన ఉపాధ్యాయుడిపై మంగళవారం కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ దయానంద్ తెలిపారు. మండలంలోని దనూర గ్రామానికి చెందిన బి.అనిత కుమార్‌ల కుమారుడు మనోహర్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. రెండు నెలల క్రితం పాఠశాలలో విద్యార్థి అల్లరి చేస్తున్నాడని ఉపాధ్యాయుడు చంద్ర ప్రకాష్ కొట్టాడు. దీంతో కాలునరం చితికిపోయి నడువలేని స్థితిలో ఉన్నాడని సోమవారం బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ బాలుడి మృతి



మోక్ష (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): మడూర్ గ్రామానికి చెందిన చాకలి సురేశ్ కుమారుడు మోక్ష(12) సోమవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మడూర్ చెరువులో తల్లితండ్రులు బట్టలు ఉతకడానికి వెల్లగా మోక్షకూడా వారి వెంట వెళ్లాడు. ఈ క్రమంలో బాలుడు చేతులు కడుగుకొనేందుకు చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే బయటకు తీసి నార్సింగి ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బాలుడు పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. బాలుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు. బాలుడి అంత్యక్రియల నిర్వహణకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సూచన మేరకు ఎంఎస్ఎస్ఓ సభ్యులు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

దుబ్బాక: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఎస్‌ఐ గంగరాజు అన్నారు. మంగళవారం దుబ్బాకలో పోలీసులు వాహన తనిఖీ చేశారు. వాహన పత్రాలు సరిగాలేని, హెల్మెట్ ధరించని 20 మంది వాహనదారులకు రూ. 3600 జరిమానా విధించామన్నారు.

నిరంతరంగా ఎంఎస్ఎస్ఓ సేవలు

మైనంపల్లి హన్మంతరావు



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు అందిస్తున్న మైనంపల్లి హన్మంతరావు

చిన్నశంకరంపేట(మెదక్): మైనంపల్లి సోషల్ సర్వీస్ సేవలు నిరంతరం కొనసాగిస్తామని మైనంపల్లి హన్మంతరావు స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని రామాయపల్లి గ్రామంలో తల్లి లేదా తండ్రిలేని చిన్నారుల పేరున రూ.25 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన బాండ్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే.. గతంలో ఎన్నికల ముందు ప్రారంభించిన ఫిక్స్‌డ్ డిపాజిట్ కార్యక్రమం ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం గతంలో అందించని గ్రామాలకు షెడ్యూల్ ప్రకారం అందిస్తున్నామన్నారు. ప్రతీ గ్రామానికి అందించే వరకు కార్యక్రమం కొనసాగుందన్నారు. మెదక్ నియోజవర్గం అభివృద్ధిలో ముందుండేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ నాయకుడు సుప్రభాత్ రావు, మాజీ ఎంపీపీ అరుణ, కాంగ్రెస్ నాయకులు గోపాల్‌రెడ్డి, నరేందర్, సత్యనారాయణ, మనోజ్, మోహన్‌నాయక్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రేషన్ డీలర్లు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా డీలర్ల సంఘం నాయకులు

మెదక్: నూతనంగా వచ్చిన మెదక్ కలెక్టర్ రాహుల్ రాజును మంగళవారం రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఆయా మండలాల అధ్యక్షులు సత్యనారాయణ, శేకులు, భిక్షపతి, నర్సింలు, ముజీబ్, బ్రహ్మానందరెడ్డి, కిష్టయ్య, శ్రీనివాస్, మెదక్ టౌన్ అధ్యక్షుడు అజీమ్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, పట్టణ గౌరవ అధ్యక్షుడు నర్సోజి, నాయకులు శ్రీనివాస్, నవీన్, రవి, నర్సింలు, గోవర్ధన్‌రెడ్డి, ప్రకాశ్, వినోద్, రమేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే తప్పనిసరి



బాలికల పాఠశాల విద్యార్థులతో సీఐ దిలీప్‌కుమార్

సీఐ దిలీప్‌కుమార్

మెదక్ మున్సిపాలిటీ: విద్యార్థినులు విద్యతో పాటు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని పట్టణ సీఐ దిలీప్‌కుమార్ సూచించారు. మంగళవారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఎవరెస్ట్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ దిలీప్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పతకాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాణీ లక్ష్మీబాయి ఆత్మ రక్షా ప్రశక్షన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో 3 నెలల పాటు కరాటే శిక్షణ ఇస్తారన్నారు. కరాటే శిక్షణ పొందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మంచి ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, కాంస్య పతాకాలతో పాటు సర్టిఫికెట్లు పొందడం హర్షనీయమన్నారు. నేను సైతం బ్లాక్ బెల్ట్ వరకూ నేర్చుకున్నానని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు రేఖ, కరాటే మాస్టర్స్ స్వప్న, గ్రాండ్ మాస్టర్ మహేశ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



నిజాంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కలెక్టర్‌గా భువనేశ్వరి, ఎంఈఓగా రుచిత, డీఈఓగా లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎంగా ఎండీ. ముషరాత్ విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం మహేందర్‌తో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో..



చేగుంటలో..

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. కృష్ణవేణి పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు జూనియర్‌లు వీడ్కోలు పలికి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. బ్రిలియంట్ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థులు స్వయంపాలన జరుపుకొన్నారు. ఈ కార్యక్రమాల్లో డైరెక్టర్‌లు లింగమూర్తి, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటలోని శ్రీవిద్య పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకొన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రిన్సిపాల్ రవీందర్ గుప్తా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నిట్టలాక్ష్మప్ప, వసుంధర, ఇందిరా, అనురాధ, సుజాత, వనజ, రేణుక, స్రవంతి, నిర్మల, సునీత, ప్రియాంక, నవనీత, శీలా తదితరులు పాల్గొన్నారు.



పాపన్నపేటలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

బీజేపీ సమావేశానికి తరలిన నాయకులు



నర్సాపూర్ నుంచి వెళ్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్: బూత్ అధ్యక్షుల సమావేశానికి నర్సాపూర్ నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. హైదరాబాద్‌లో మంగళవారం బీజేపీ ఏర్పాటు చేసిన బూత్ అధ్యక్షుల సమావేశానికి కేంద్ర మంత్రి అమిత్‌షా హాజరయ్యారు. వెళ్లిన వారిలో సమావేశానికి నర్సాపూర్ నుంచి పార్టీ జిల్లా కార్యదర్శులు సురేశ్, రాజేందర్, పార్టీ నాయకులు రమేశ్‌గౌడ్, శ్రీనివాస్, రమణరావు, ఆంజనేయులుగౌడ్, ప్రేమ్ తదితరులు తరలి వెళ్లారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభకు వెళ్లిన వారిలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మండలాధ్యక్షుడు రాకేశ్, బూత్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రముఖులు, మండల ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు అశోక్, పాల నాగయ్య, రాజు, కృష్ణ తదితరులు వెళ్లారు.